క్లుప్తంగా

దాతల విరాళం



విరాళాన్ని అందజేస్తున్న నాగరాజు, జగదీశ్వరీబాయి

పులిచెర్ల(కల్లూరు): జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం కల్లూరు హైస్కూల్లో నిర్వహించనున్న సైన్స్‌కు సంబంధించిన వివిధ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచే విద్యార్థులకు బహుమతులు ఇవ్వడానికి దాతలు విరాళాలు ఇచ్చారని హెచ్ఎం శ్రీవాణి తెలిపారు. నాగరాజు, జగదీశ్వరీబాయి రూ.10 వేలు, వీరయ్య, ఆర్ఎస్.బాలాజి, అరుణ్ కుమార్ మొత్తం కలిపి రూ.14,500 ఇచ్చారని పేర్కొన్నారు. విరాళాన్ని సైన్స్ టీచర్ వెంకటసిద్దులకు అందజేశామని తెలిపారు.

నేటి నుంచి ఎల్లమాంబ వార్షికోత్సవాలు

శాంతిపురం: సోగడబల్ల వద్ద ఉన్న గురుమూర్తి ఎల్లమాంబ ఆలయ 31వ వార్షికోత్సవాన్ని శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్టు ధర్మకర్తలు నాగమ్మ, చెంగప్ప గురువారం తెలిపారు. తొలి రోజు గణపతి హోమం, యమున పూజ, దుర్గాహోమం, అన్నదానం, విశేష అలంకరణ ఉంటాయన్నారు. శనివారం అభిషేకం, పచ్చి గెరిగ, అగ్నిగుండం, ఆదివారం అమ్మవారికి పొంగళ్ల సమర్పణ ఉంటుందని చెప్పారు.

స్వచ్ఛందంగా ముందుకు రావాలి



మామడుగులో అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు, సిబ్బంది

గంగవరం: ఫార్మర్ ఐడీ నమోదు కోసం రైతులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఏఓ హేమలత గురువారం కోరారు. గత కొన్ని రోజులుగా మండల వ్యాప్తంగా జరుగుతున్న ఫార్మర్ ఐడీ నమోదు కార్యక్రమం వేగవంతం చేసినట్టు ఆమె పేర్కొన్నారు. మండలంలోని మామడుగు గ్రామంలో రైతు ఐడీ రిజిస్ట్రేషన్ కార్యక్రమంపై వ్యవసాయ సిబ్బంది, రైతులు కలిసి ర్యాలీ ద్వారా అవగాహన కల్పించారు. ఇతర ప్రాంతాల్లో స్థిరపడి సొంత గ్రామాల్లో భూములు కలిగిన రైతులు ఫార్మర్ ఐడీ నమోదుకు గ్రామాలకు వచ్చి త్వరగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

నేడు జాబ్ మేళా

పుంగనూరు: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖాధికారి పద్మజ తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ జాబ్ మేళాకు వివిధ కంపెనీల ప్రతినిధులు హాజరవుతారన్నారు. జాబ్‌మేళాకు హాజరయ్యే నిరుద్యోగులు 18 నుంచి 30 సంవత్సరాల లోపు ఉండాలన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ పాస్ లేదా ఫెయిల్ అయిన వారు ఇంటర్వ్యూకు హాజరుకావచ్చునన్నారు. ఆసక్తి గల నిరుద్యోగులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

కనుల పండువగా శ్రీవారి వార్షికోత్సవాలు



విశేష అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరుడు

శాంతిపురం: దండికుప్పం కొండపై ఉన్న పురాతన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు, సేవలను నిర్వహించారు. శ్రీవారి ఆలయంలో శివరాత్రి తర్వాత రోజు వార్షిక ఉత్సవాలను నిర్వహించే ఆనవాయితీ తరాలుగా కొనసాగుతోంది. వైష్ణవ, శైవ భేదం లేకుండా ఈ ప్రాంతంలోని అందరూ మహాశివరాత్రిని ఆచరించి, మరుసటి రోజు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారిని దర్శించుకుంటారు. ఈ సందర్భంగా తిరుప్పావై సేవ, ప్రాకారోత్సవం, కోనేటి ఉత్సవం వైభవంగా జరిపించారు. కార్యక్రమాలకు భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

నేడు బెగ్గిలిపల్లెలో పౌరహక్కుల దినోత్సవం

గుడుపల్లె: మండలంలోని బెగ్గిలిపల్లె ఎస్సీ కాలనీలో శుక్రవారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సీతారాం గురువారం తెలిపారు. మండలంలోని పౌరహక్కులకు సంబంధించిన సభ్యులు అందరూ హాజరై గ్రామంలోని సమస్యలను పరిష్కరించాలన్నారు. మండల అధికారులు తప్పక హాజరు కావాలని పేర్కొన్నారు.

బతుకు బోరు!

- వ్యవసాయ బోర్లలో తగ్గుతున్న జలం
- ఎండిపోతున్న చెరువులు
- వెయ్యి అడుగులు వేసినా కానరాని నీటి జాడ
- వేసవిలో సాగునీటిపై రైతుల్లో భయం



పలమనేరు ప్రాంతంలో ఎండిపోయిన వ్యవసాయ బోర్లు



పలమనేరు: అసలే కష్టాల్లో ఉన్న రైతన్నకు అడుగంటుతున్న నీటితో కష్టాలు తప్పడం లేదు. భూగర్భ జలాలు అడుగంటి మొన్నటిదాకా రెండు ఇంచులు వచ్చిన నీళ్లు ఇప్పుడు ఇంచ్‌కు పడిపోయాయి. దీంతో పంటలను కాపాడుకునేందుకు రైతులు కొత్త బోర్లను వేయాల్సి వస్తోంది. బోరు వేసినా గంగ కరుణిస్తుందనే నమ్మకం లేదు. అప్పోసప్పో చేసి బోరు వేసినా నీళ్లు పడతాయన్న గ్యారంటీ లేక కొందరు బోర్లు వేసేందుకు ఆసక్తి చూపడం లేదు. మూడేళ్ల క్రితం సరాసరి బోర్ల లోతు 750 అడుగులు ఉండగా, ప్రస్తుతం వెయ్యి అడుగులపైన డ్రిల్ చేస్తేగానీ చెప్పలేని పరిస్థితి నెలకొంది. దీంతో ఎండుతున్న పంటలను కాపాడుకునేందుకు రైతన్నలు పడుతున్న ఆపసోపాలు అన్నీఇన్నీ కావు. దీనికి తోడు చెరువులు, నదుల్లో ఇసుక తవ్వకాలు, మట్టి తోడేయడంతో భవిష్యత్తుల్లో పలమనేరు డివిజన్‌లలో భూగర్భజలాలు అడుగంటే పరిస్థితి కనిపిస్తోంది.

నెల వ్యవధిలో బోర్లలో గ్యాప్‌లు..

పలమనేరు రెవెన్యూ డివిజన్లలో రైతులు పూర్తిగా బోరు బావుల పైనే వ్యవసాయాన్ని సాగు చేస్తున్నారు. ఈప్రాంతంలో 80 శాతం మందికి వ్యవసాయమే జీవనాధారం. మరోవైపు నదులు, వాగులు, కాలువలు లేకపోవడంతో రైతుల పొలాల్లో వ్యవసాయబోర్లు వేసుకొని పంటలను సాగుచేసుకుంటున్నారు. డివిజన్ పరిధిలో 80వేల వ్యవసాయ బోర్లున్నాయి. ఇప్పటికే భూగర్భజలాలు అడుగంటి 20వేల బోర్లలో రెండు ఇంచులొస్తున్న నీరు ఇప్పుడు ఇంచ్ కూడా రావడం లేదు. నెల రోజుల్లో చాలా బోర్లు ఎండిపోయాయి. దీంతో పంటలు కంటి ముందే ఎండుతుంటే రైతన్నలు ఏం చేయాలో అర్థంగాక తలలు పట్టుకుంటున్నారు. కొందరు అప్పుచేసి కొత్త బోర్లు లేదా పాతబోర్ల డీపెనింగ్ చేస్తున్నా పదిలో మూడింట మాత్రమే నీటి జాడ కనిపిస్తోంది.

బోరు వేయాలంటే రూ.3 లక్షలు..

భూగర్భ జలాలు అందుగంటడంతో 1000 అడుగుల బోరు, కేసింగ్ పైపులకు రూ.3 లక్షల దాకా రైతు ఖర్చు పెట్టాల్సి వస్తోంది. ఇంత ఖర్చు పెట్టినా నీరు రాకుంటే చేసిన అప్పులు తీర్చలేక, పంటను సాగు చేయలేక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఒకవేళ బోరులో నీళ్లు పడినా బోరుకు మోటారు, పైపులు అమర్చేందుకు మరో రూ.2లక్షలు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఉంది. ఆ లెక్కన బోరు వేసి, మోటారు బిగించాలంటే రూ.5లక్షలు ఖర్చు పెట్టాల్సిందే.

వర్షాలు లేక ఎండిన చెరువులు....

ఈ ప్రాంతంలో వర్షాలు అంతంత మాత్రంగానే కురుస్తుంటాయి. గత ఏడాదిగా సాధారణ వర్షపాతం సైతం ఇక్కడ నమోదు కాలేదు. ఫలితంగా భూగర్భ జలాలు అడుగంటి ఈ సమస్య ఏర్పడింది. దీనికి తోడు ఈ ప్రాంతంలో 800 చెరువులుండగా 690 చెరువుల్లో చుక్కనీరు లేకుండా ఎండిపోయాయి.

చెరువుల ఆక్రమణ..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అక్రమార్కులు చెరువుల్లో మట్టిని తరలించేస్తున్నారు. ఇక ఇసుక అక్రమ రవాణా తగ్గేదేలేదన్నట్టు యథేచ్ఛగా సాగుతోంది. దీంతో ఉన్న చెరువులను ఇప్పటికే సర్వనాశనం చేసేశారు. దీంతో భవిష్యత్తులో వర్షాలు పడినా చెరువుల్లో నీరు నిల్వ ఉండే పరిస్థితి కనిపించడం లేదు. చెరువులే కాదు వాగులు, వంకలు, కౌండిన్య నది ఇలా దేన్ని వదలకుండా ఇప్పటికే ఇసుకాసురులు పూర్తిగా ధ్వంసం చేసేశారు.



బోర్లలో నీళ్లు తగ్గి ఎండుతున్న వరి పంట

వెయ్యి అడుగులేసినా గ్యారంటీ లేదు..



మా ప్రాంతంలో భూగర్భ జలాలు చాలా అడుగంటాయి. నాలుగేళ్ల ముందు 200 నుంచి 300 అడుగుల్లో నీళ్లు పడేవి. ఇప్పుడు వెయ్యి అడుగులేసినా నీళ్లు పడతాయనే గ్యారంటీ లేదు. ఒక బోరు విఫలమైతే రైతు మళ్లీ కుదురుకోవడం అంత సులువు కాదు. నా పొలాన్ని బీడు పెట్టేశా. చెరువులను, నదులను ఇసుకాసురుల నుంచి కాపాడండి.

–పుష్పరాజ్, ఏటిగడ్డిండ్లు

పాడి ఆవులు మేపుకుంటున్నారు..



చెరువుల్లో నీళ్లలేక కీలేరి సాగు లేదు. కొత్తగా బోరేసినా నీళ్లు వస్తాయనే గ్యారంటీ లేదు. బోర్లను లోతు చేయిద్దామంటే ఉన్న నీళ్లు ఎక్కడ ఆగిపోతాయోననే భయం. దీంతో చాలామంది రైతులు సేద్యాన్ని వదిలేసి పాడి ఆవులు మేపుకుంటున్నారు.

–గిరి, పెంగరగుంట

నీటి సమస్యను పరిష్కరించండి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: రోజురోజుకూ ఎండ తీవ్రత ఎక్కువ అవతుండడంతో మండలంలో చాలా వరకు గ్రామాల్లో తాగునీటి సమస్య ఏర్పడింది. అధికారులు దీనిపై వెంటనే స్పందించాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో తాగునీటి సమస్యపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ ప్రసుత్తం తాగునీటి సమస్యలున్న గ్రామాలను గుర్తించి వెంటనే నూతన బోర్ల ఏర్పాటుకు సన్నాహాలు సిద్ధం చేయాలన్నారు. ఎండ తీవ్రత పెరిగే కొద్దీ తాగునీటి సమస్యలు తీవ్రమయ్యే అవకాశం ఉందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు మండల, జిల్లాపరిషత్ నిధులను వినియోగించి నూతన బోర్లు వేయించాలని ఆదేశించారు. ఎంపీడీఓ ఈశ్వర్, నేతలు అమరనాథ్, మోహన్‌రాజు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు

పలమనేరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను అన్ని కార్మిక సంఘాలు ఎండగట్టాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద కార్మిక సంఘాల విలీన సంఘ పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ అసంఘటిత రంగాలను కకావికలం చేసి, కేవలం కార్పొరేటర్ల కోసం బీజేపీ, కూటమి ప్రభుత్వాలు పనిచేస్తున్నాయన్నారు. మార్చి 2న రాజమండ్రి వద్ద జరిగే విలీన సభను జయప్రదం చేయాలన్నారు. యోగేష్ బాబు, వెంకటరమణ, ఆనంద్ పాల్గొన్నారు.

వైశ్య మహిళలను కించపరిచాడని ఫిర్యాదు



సీఐకు ఫిర్యాదు చేస్తున్న ఆర్యవైశ్యులు

పలమనేరు: ఆర్యవైశ్య మహిళలను ఓ వ్యక్తి ఆడియో రికార్డింగ్ ద్వారా కించపరిచాడని పలమనేరు పట్టణానికి చెందిన వాసవి వనితా క్లబ్, ఆర్యవైశ్య మహిళా మండలి వారు స్థానిక సీఐ నరసింహ రాజుకు గురువారం ఫిర్యాదు చేశారు. తాము ఆర్యవైశ్య వనభోజనాల్లో భాగంగా సంప్రదాయ నృత్యాలతో ఆహ్లాదంగా గడిపిన విడియోపై బెంగళూరుకు చెందిన సుధీర్ అనే వ్యక్తి తప్పుడు కామెంట్ చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమపై సోషల్ మీడియాలో ఆడియో ట్రోల్ చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వీరికి మద్దతుగా పట్టణంలోని ఆర్యవైశ్యులు పెద్దసంఖ్యలో ర్యాలీగా పోలీసు స్టేషన్ వద్దకు చేరుకున్నారు. ఆర్వీ సుభాష్‌చంద్ర బోస్, ఆర్వీ బాలాజీ, సత్యప్రకాష్ పాల్గొన్నారు. కాగా వీరు ఫిర్యాదు చేసిన వ్యక్తి సైతం వైశ్యుడే కావడం గమనార్హం. తాను ఆ వీడియో చూసి కడుపు మండి మాట్లాడానే కానీ ఎవరి మనసులు కష్టపెట్టడానికి కాదని ఆడియోలో మాట్లాడం కొసమెరుపు.

2న మండల సమావేశం

గుడుపల్లె: మండల సర్వసభ్య సమావేశం ఆదివారం స్థానిక వెలుగు కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రాధాక్రిష్ణ తెలిపారు. ప్రజా సమస్యలను ప్రజా ప్రతినిధులు, అధికారులు చర్చించి పరిష్కరించాలన్నారు. సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలన్నారు.

వ్యవసాయ పొలాల్లో అగ్నిప్రమాదం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

పుంగనూరు: మండలంలోని మొరవభీమగానిపల్లె వద్ద గురువారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు కథనం మేరకు.. గ్రామానికి చెందిన చిన్నరెడ్డెప్ప వ్యవసాయ పొలాల్లో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగడంతో స్థానికులు గుర్తించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే అక్కడికి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో డ్రిప్ పరికరాలు, బోరు స్టాటర్లు, వైర్లు దగ్ధమైనట్లు తెలిపారు. రూ.లక్ష మేరకు ఆస్తినష్టం సంభవించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.

మున్సిపాలిటీ ఆదాయం రూ.35.43లక్షలు

పలమనేరు: మున్సిపల్ కార్యాలయంలో మున్సిపాలిటీకీ చెందిన పలు ఆస్తులపై గురువారం జరిగిన వేలంలో రూ.35.43లక్షల ఆదాయం దక్కినట్టు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. ఆమేరకు స్థానిక కార్యాలయలో వారపుసంత, దినసరి కూరగాయల మార్కెట్, మూడు మాంసపు దుకాణ గదులు వేలంపాటలో ఈ మొత్తం దక్కిందని ఈసందర్భంగా ఆయన తెలిపారు. కాగా చింతచెట్ల ఫలసాయం, చేపల చెరువులు, కొన్ని దుకాణాలకు వేలం పాటదారులు ఆసక్తి చూపలేదని వీటికి మళ్లీ నోటిఫికేషన్ ఇచ్చి వేలంపాట నిర్వహిస్తామని పేర్కొన్నారు.

భూసార పరీక్షలు చేసుకోండి



భూసార పత్రాలతో రైతులు, చిత్రంలో ఏఓ

గుడుపల్లె: భూములు సారవంతం కావాలంటే రైతులు భూసార పరీక్షలు తప్పక చేసుకోవాలని వ్యవసాయాధికారి నాగరాజు అన్నారు. గురువారం మండలంలోని కనమనపల్లె, బెగ్గిలిపల్లె, అగరం గ్రామాల్లో భూసార పరిరక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. భూసార పరీక్ష పత్రం ఆధారంగా నేల రకం, వివిధ పోషకాల లభ్యత గురించి తెలుసుకోవచ్చని ఆయన అన్నారు. దీనివల్ల అవసరమైన మేరకు పంటలకు ఎరువులు వాడడం ద్వారా తక్కువ పెట్టుబడులతో నాణ్యమైన అధిక దిగుబడులు వస్తాయని ఆయన ఈసందర్భంగా తెలిపారు. నేల సారావంతంగా ఉంటేనే ఆ భూమి మంచి పంటలు ఇస్తుందన్నారు. రైతులు తప్పక భూసార పరీక్షలు చేసుకుని ఆరోగ్యకరమైన పంటలు పండించాలన్నారు. రైతులు తప్పక భూసార పరీక్షలు చేసుకోవాలని సూచించారు.

రుణాల ఇంటర్వ్యూలకు బారులు





ఇంటర్వ్యూకు అభ్యర్థులతో కిక్కిరిసిన సచివాలయం, బ్యాంకర్లకు దరఖాస్తు ఫారాలు అందిస్తున్న అభ్యర్థులు

- మంజూరైంది 159
- దరఖాస్తులు 2,150

కుప్పం: రాష్ట్ర ప్రభుత్వం వివిధ కార్పొరేషన్ల ద్వారా మంజూరు చేసిన రుణాలకు జరిగిన ఇంటర్వ్యూలకు అభ్యర్థులు బారులు తీరారు. గురువారం మండల సచివాలయంలో కుప్పం మండలంలో కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, కాపు కార్పొరేషన్ రుణాలకు అభ్యర్థులకు స్వయం ఉపాధి కోసం రుణాలు మంజూరు చేశారు. ప్రభుత్వం 50 శాతం రాయితీతో అందించే రుణాల కోసం యువత భారీ ఎత్తున దరఖాస్తులు చేసుకున్నారు. మండల సచివాలయంలో 5 కౌంటర్లు ఏర్పాటు చేసి బ్యాంకు సిబ్బందితో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఉదయం నుంచి దరఖాస్తుదారుల అభ్యర్థులతో మండల సచివాలయం కిటకిటలాడింది.

మంజూరైంది 159.. దరఖాస్తులు 2,150..

కుప్పం మండలానికి వివిధ కార్పొరేషన్ రుణాలు 159 ప్రభుత్వం మంజూరు చేసింది. వీటిలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, కాపు కార్పొరేషన్ ద్వారా అభ్యర్థులకు దరఖాస్తులు ఆహ్వానించారు. దరఖాస్తులకు చివరి తేదీలను పొడిగిస్తూ ప్రభుత్వం కాల పరిమితి నిర్ణయించడంతో భారీగా దరఖాస్తులు అందాయి. దీంట్లో కుప్పం మండలం నుంచి కార్పొరేషన్ల రుణాల కోసం 2,150 దరఖాస్తులు అందినట్లు అధికార గణాంకాలు చెపుతున్నాయి. ప్రభుత్వం మాత్రం కేవలం 159 రుణాలను మాత్రమే మంజూరు చేసింది. దీనిలో సామాన్యులకు కార్పొరేషన్ రుణాలను అందని ద్రాక్షలా మారిందని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



మాట్లాడుతున్న చైర్మన్, కమిషనర్

పుంగనూరు: రానున్న వేసవిలో పట్టణంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా తెలిపారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో అజెండాలోని అంశాలను చర్చించి, ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించారు. చైర్మన్ మాట్లాడుతూ వేసవిలో పట్టణంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక ప్రణాళికల ద్వారా ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి సూచనల మేరకు తాగునీటి సమస్యను గుర్తించి, ప్రాంతాల వారీగా సమస్యలను పరిష్కరించే విధంగా అధికారులను అప్రమత్తం చేసి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. వైస్ చైర్మన్లు నాగేంద్ర, లలిత, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

కలప వేలం.. ష్.. గప్‌చుప్!

- ఎక్స్‌ప్రెస్ హైవేలో తొలగించిన కలపకు వేలం
- మీడియాకు సైతం సమాచారం లేకనే
- వేలం పాటకు హాజరైన డీఎఫ్‌ఓ భరణి
- 197 టన్నుల కలప రూ.30.14 లక్షలు



కలపకు వేలం నిర్వహిస్తున్న డీఎఫ్‌ఓ భరణి

పలమనేరు: సాధారణంగా పంచాయతీలో వారపుసంత వేలం వేయాలన్నా ప్రభుత్వ కార్యాలయాల వద్ద నోటీసు బోర్డుపై వేలం ప్రకటన పెట్టడం ఆనవాయితీ. ఇక గ్రామాల్లో అయితే టాంటాంలు సైతం వేయిస్తారు. మున్సిపాలిటీలో పరిధిలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద ప్రకటన పెట్టి అక్కడి ప్రింట్, లోకల్ మీడియాల ద్వారా విస్తృత ప్రచారం చేయడం ఆనవాయితీ. ఎందుకంటే వేలంపాట విషయం పదిమందికి తెలిస్తే ఎక్కువమంది వేలానికి వచ్చి ప్రభుత్వానికి ఎక్కువగా ఆదాయం వస్తుంది. కానీ ఈ మధ్య వేలం పాటలు నాలుగో చెవికి పడకుండానే గోప్యంగా సాగుతున్నాయి. ఆమేరకు పలమనేరు ఫారెస్ట్ రేంజ్ కార్యాలయంలో జిల్లా అటవీశాఖ అధికారిని పాల్గొనే వేలంపాట విషయం కూడా కనీసం మీడియాకు తెలియకుండా గురువారం జరిపించేశారు. ఇంత రహస్యంగా ఎందుకు వేలం నిర్వహించాలో దాని వెనుకనున్న పరమార్థమేమిటో కేవలం ఫారెస్ట్ అధికారులు, వేలంలో దక్కించుకున్న సిండికేట్‌కు మాత్రమే ఎరుక.

ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డు నిర్మాణంలో నరికేసిన కలపకు వేలం..

బెంగళూరు–చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంలో భాగంగా అడవిలోని పలు రకాల చెట్లను తొలగించిన 197 టన్నుల కలపను పట్టణ సమీపంలోని గోరితోపులో లాటింగ్ చేశారు. ఇందుకు సంబంధించిన వేలం డీఎఫ్‌ఓ భరణి ఆధ్వర్యంలో జరిగింది. ఈ వేలానిక 23మంది కలప వ్యాపారులు హాజరయ్యారు. అప్పటికే సిండికేట్ అయిన వీరిలో అత్యధికంగా టన్ను రేటు రూ.1,530 అంటే కిలో రూ.1.50 పైసలు పలికిన వ్యక్తి ఈ కలపను దక్కించుకున్నాడు. ఆమేరకు 197 టన్నుల కలపకు అటవీశాఖకు దక్కింది రూ.30.14లక్షలు మాత్రమే. ఎక్కడైనా కలప కిలో ఇంత చీప్‌గా దొరుకుతుందా. కనీసం వేడినీళ్లు కాచుకొనే కట్టెలైనా దొరుకుతాయా అనే అనుమానం ఎవరికైనా వస్తుంది.

వేలానికి మరు వేలం...

ఇలా అధికారుల సహకారంతో సిండికేట్ ద్వారా తక్కువ ధరకు దక్కించుకొన్న కలపను మళ్లీ ఇదే వ్యాపారులు బడా వ్యాపారులకు ఎక్కువ ధరలకు అమ్ముకుంటారు. దీంతో భారీగా లాభాలు దక్కించుకుంటారు. వచ్చిన లాభంలో వేలంలో పాల్గొన్న వారికి కమీషన్లు, వేలం విషయం ఎవరి చెవిలో పడకుండా గుట్టుగా ఉంచిన అధికారులకు చేరుతుందనే మాట కొత్తగా చెప్పాల్సిందేమీలేదు. ఏదేమైనా అడవిలో కట్టెల కొడితేనే కేసులని భయపెట్టే ఫారెస్ట్ అధికారులు ఇలా ప్రభుత్వ ఖజానా విషయంలో వ్యవహరించడం సామాన్య ప్రజల్లో సైతం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. కలప వేలం పాటలో ఏసీఎఫ్ వేణుగోపాల్, ఎఫ్ఆర్వో నారాయణ, ఎఫ్ఎస్వో సుకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కోలాహలం.. సీతమ్మగుట్ట తిరునాళ్ల



అలంకరణలో శివలింగం

సదుం: మండలంలోని సీతమ్మగుట్ట వద్ద గురువారం తిరునాళ్ల కోలాహలంగా జరిగింది. శివరాత్రి మరుసటి రోజు గుట్టపై తిరునాళ్ల నిర్వహించడం ఆనవాయితీ. గుట్టపై ఉన్న సీతమ్మ, శివాలయాలను, గుట్ట కింద ఉన్న ఆంజనేయ, వినాయకస్వామి ఆలయాలను పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించి, మొక్కులు చెల్లించారు. తిరునాళ్లకు వచ్చే భక్తుల కోసం అన్నదానం చేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి ఆలయాలను దర్శించుకొని పూజలు చేశారు.